**కథ**

# వలస పక్షులు

**ఆకునూరి మురళీకృష్ణ**

**"కూ" అంటూ కూతవేస్తూ రైలుబండి వేగంగా దూసుకుపోతుంటే నాకు ఆనందంతో గాల్లో తేలిపోతున్నట్లుగా ఉంది.**

'ఈ ప్రయాణం నేను ఊహించనిది' అని చెబితే తప్పే అవుతుంది.

శరీరం సుఖవిలాసాల్లోనూ, భోగలాలసల్లో తేలిపోతున్నా ఆ యాంత్రికతలో అలసిపోయిన నా మనసుకి సేద తీర్చుకోవడం కోసం నేను గతంలో ఎన్నోసార్లు ఈ రైలు ప్రయాణాన్నే ఊహించుకుంటూ గడిపాను.

కానీ, ఈ ప్రయాణం ఇంత తొందరగా నిజమై ఇలా అద్భుతమైన మలుపులు తిరుగుతుందని మాత్రం నేను నిజంగానే ఊహించలేదు.

రైలు ముందుకి పరిగెడుతుంటే నా మనసు వెనక్కి వెనక్కి... జీవితంలోకి పరుగులు పెడుతోంది.

ఈ ప్రయాణం నాకు నన్ను నేను వెదుక్కుంటూ... నాలోని నేను సాగిస్తున్న ప్రయాణంలా ఉంది.

నాకేమిటి?

మా రామలక్ష్మికి, బాబికి, సుందరానికి, కౌసల్యకీ కూడా అలాగే ఉంది.

కలవక కలవక ఇన్నాళ్లకి ఈ రైల్లో కలిశాం.

అసలు మా అందరికీ ఒకే సమయానికి ఒకే ఆలోచన రావడం ఎంతటి యాదృచ్ఛికం.

ఆ ప్యాసింజరు రైల్లో మేము ఐదుగురు ఒకరినొకరు చూసుకోగానే మాకు ఆశ్చర్యపోవడానికి బుర్రలూ తెరవడానికి నోళ్లూ చాలలేదు!

రామలక్ష్మి అయితే మా అందర్నీ పట్టుకుని ఉద్వేగం పట్టలేక భోరుమని ఏడ్చేసింది. దాంతో మా అందరికీ కూడా కళ్లలోకి నీళ్లు వచ్చేశాయి.

"ఏమిట్రా... ఏమైపోయారిన్నాళ్లూ" అంటూ ఒకరినొకరం నిలదీసుకున్నాం.

"ఇన్నాళ్లూ మనం ఒకరినొకరం కలుసుకోకుండా...కనీసం ఉత్తరాలైనా రాసుకోకుండా ఏ శక్తి మనకి అడ్డు పడింది?" అంటూ చర్చించాం.

"ఉత్తరాలా? ఉత్తరం అనేదిప్పుడు తోకతెగిన పిట్టయిపోయింది. పత్రికాఫీసు నుంచి తప్ప వేరే చోటు నుంచి నాకు ఉత్తరం వచ్చి ఏళ్లు గడిచిపోయాయి" అంది కౌసల్య. అది అప్పుడప్పుడూ నాలాగే కథలు కెలుకుతూ ఉంటుంది.

"అవును. ఉత్తరం అంటే ఇప్పుడు ఆఫీసు కరెస్పాండెన్స్. పెర్సనల్‌గా నాకు ఉత్తరం వచ్చి ఎన్నేళ్లయిపోయిందో" అన్నాడు బాబి కూడా.

"అప్పట్లో పోస్టుమ్యాన్ అంటే ఎంతో ఆప్తుడిలా ఉండేవాడు. మీరంతా చదువులకని, ఉద్యోగాలకని వేరే వేరే ఊళ్లు వెళ్లిపోయాక మనూళ్లో కొంత కాలం నేనొక్కడినే ఉండిపోయాను గుర్తుందా? ఆ రోజుల్లో మధ్యాహ్నం పూట సందు చివర పోస్టుమేన్ సైకిల్ బెల్ వినిపించిందంటే ఎంత ఉద్వేగంగా ఉండేదనుకున్నారు? మీ దగ్గర్నుంచి వచ్చే ఉత్తరాల కోసం గబగబా గుమ్మంలోకి వచ్చి నిల్చునేవాడ్ని. ఇప్పుడా ఎదురు చూపులూ లేవు ఆ థ్రిల్లూ లేదు" అన్నాడు సుందరం.

"అప్పట్లో ఉత్తరం రాయాలంటే ఎంతో శ్రమ. కవరు కొనాలి, స్టాంపులు కొనాలి, ఉత్తరం రాశాక మళ్లీ పోస్టాఫీసుకి వెళ్లి డబ్బాలో వెయ్యాలి. కానీ ఇప్పుడో? అవేమీ అక్కరలేదు. కొరియర్ వాడు మన ఇంటికో ఆఫీసుకో వచ్చి కవరు తీసుకెడతాడు. ఇంకా ఫోన్లూ.. ఇంటర్నెట్.. ఈ-మెయిల్స్ ఎన్నో ఉన్నాయి. కానీ మనం మాత్రం ఒకరినొకరం పలకరించుకుని ఏళ్లు గడచిపోయాయి." నిష్ఠూరంగా అంది రామలక్ష్మి.

ఆమె మాటల్లో నిజం ఉంది.

ఆ నిజాన్ని అంగీకరిస్తున్నట్లుగా అందరూ కాసేపు మౌనంగా ఉండిపోయారు.

"జీవితం చాలా మారిపోయింది" అన్నాడు బాబి దిగులుగా.

"జీవితమేం మారిపోలేదు. మనమే మారిపోయాం" అంది రామలక్ష్మి.

కౌసల్య ఆమె మాటల్ని ఖండించింది.

"జీవితమూ మారలేదు... మనమూ మారలేదు. మనం ఇలాంటి జీవితమే కావాలనుకున్నాం. అనుక్షణం కష్టపడ్డాం. పరుగులు పెట్టి మరీ సాధించాం!" అంది.

నాకు ఆ మాటలకి ఆనందంతో చప్పట్లు కొట్టాలనిపించింది. కౌసల్య వంక మెచ్చుకోలుగా చూసి ఆమె భుజం తట్టాను.

అక్కడున్న వాళ్లంతా పెద్దపెద్ద విద్యావంతులూ, మేధావులూ, జీవితంలో ఎన్నో విజయాలు సాధించిన వాళ్లూను. కౌసల్య మాటలు అర్థంచేసుకోలేనంత అమాయకులేం కాదు!

"అంటే మనం ఎవరికి వాళ్లం వాళ్ల వ్యక్తిగత వ్యామోహాల్లో పడి మన మూలాలని మరచిపోయామంటావా?" అన్నాడు సుందరం.

"మరచిపోలేదు...విస్మరించాం" అంది కౌసల్య.

"రెండిటికీ తేడా ఏముంది?" అంది రామలక్ష్మి.

"మరచిపోతే సుఖంగా ఉండేవాళ్లం. అసలీ ప్రయాణమే ఉండేది కాదు!" అంది కౌసల్య.

ఇంజను ఒక్కసారిగా "కూ" అని కూత పెట్టింది మళ్లీ. రైలు మలుపు తిరుగుతోంది. కిటికీలోంచి చూస్తుంటే ఇంజను కనిపిస్తోంది. అలా చూసి ఎన్నాళ్లయిందో. కిటికీలోంచి తల బయటకి పెట్టాను.

పచ్చని పైర్ల మీద నుంచి వచ్చే గాలి చల్లగా ముఖాన్ని తాకింది.

ఆ స్పర్శ ఎంతో హాయిగా ఉంది. అన్నింటినీ మించి ఆ గాలి మోసుకొస్తున్న మా ఊరి పరిమళం..

చాలా కాలం తర్వాత ఊపిరి పీల్చుకుంటున్నట్లుగా ఉంది నాకు.

కౌసల్య చెప్పినట్లుగా.. మరచిపోగలిగితే ఈ బాధే ఉండేది కాదు!

"సరే అయితే...ఏం చేద్దామనుకుంటున్నారిప్పుడు అంతా" అందరి వంకా చూస్తూ అడిగింది రామలక్ష్మి.

"నా మటుకు నేను ఈ యాంత్రిక జీవనంతో విసిగెత్తిపోయాను. జీవితంలో అనుకున్నవన్నీ సాధించాను. ఇన్నాళ్లూ నేను సంపాదించిన డబ్బూ, సాధిస్తున్న విజయాలూ క్రమక్రమంగా నాకు సంతృప్తినివ్వడం మానేస్తున్నాయి. ఇవన్నీ లేనపుడే నేను హాయిగా ఉన్నానేమోననిపిస్తోంది.

చిన్నప్పుడు మనందరం మన ఊళ్లో కలసిమెలసి గడిపిన రోజులెంత బావుండేవి? ఆ రోజుల్లో మా కుటుంబం రెండు పూట్లా కడుపునిండా తినడానికి తిండి కూడా లేకుండా ఎన్నో అవస్థలు పడేవాళ్లం. అయినా ఎంతో నిబ్బరంగా ఉండేవాళ్లం. ఇప్పుడు అన్నీ ఉన్నా కూడా గుండెల్లో ఏదో తెలియని గుబులు. అనుక్షణం తుళ్లిపడుతున్నట్లుగా ఉండే ఆనాటి ఉత్సాహం ఏమయింది? అందుకే ఎప్పుడో పోగొట్టుకున్న నన్ను నేను వెదుక్కుంటూ మనూరికి ఇలా ప్రయాణమయ్యాను" అన్నాడు సుందరం.

సుందరం మాటల్ని నేను ఆశ్చర్యంగా వింటున్నాను.

అచ్చంగా నేనేదైతే చెప్పదలచుకున్నానో అవే మాటలు అతడి నోటిలోంచి వెలువడ్డాయి.

మిగిలిన వాళ్ల ముఖాల్లోని ఉద్వేగాన్ని గమనిస్తుంటే



వాళ్లందరి భావాలూ కూడా అవేనని అర్థమవుతోంది. ప్రతి మనిషీ జీవితంలో ఏదో ఒక్క స్టేజిలో అలా ఫీలవ్వక తప్పదేమో!

కానీ, మా అందరి మనసుల్లోకీ ఒకేసారి అలాంటి ఫీలింగ్ రావడం, మేమంతా ఇలా కలుసుకోవడం... విచిత్రాల్లోకెల్లా విచిత్రం!

"ఆ రోజుల్లో అయితే మనమంతా జీవితాన్ని అప్పుడే మొదలుపెడుతున్న స్టేజిలో ఉన్నాం. జీవితం పట్ల ఎన్నో ఆశలూ, కలలూ, ఆశయాలూ ఉండేవి. అవే మనకి ఉత్సాహాన్నిచ్చేవేమో... ఇపుడు మనమందరం మళ్లీ వెనక్కి వెళ్లిపోయినంత మాత్రాన మన ఊరు మన ఊరిలా మన స్నేహం మునుపటి స్నేహంలా ఉంటుందనుకుంటే పొరపాటే" అంది కౌసల్య.

"నువ్వు చెప్పింది నిజమే. కానీ అప్పటి మన ఆశలకీ ఆశయాలకీ ఒక బేస్ ఉండేది. నువ్వే అన్నావుగా... ఆ మూలాలని విస్మరించడమే మనం చేసిన పొరపాటు అని. ఎలాగూ బయలుదేరాం కదా, చూద్దాం... మనూళ్లో ఎన్నాళ్లు ఉండగలమో? నా మటుకు నేను ఇంక శాశ్వతంగా అక్కడే ఉండిపోవాలనుకుంటున్నాను" అన్నాడు బాబి.

"అదిగో... గువ్వవానిపాలెం వచ్చేసింది. ఇంకో నాలుగు వె ై ళ్ల దాటితే మన ఊరే!" అరుస్తున్నట్లుగా అంది రామలక్ష్మి.

అందరం కిటికీల్లోంచి తలలు బయటకి పెట్టి ఆత్రంగా చూశాం.

దూరంగా కనిపిస్తోంది నీలమ్మ చెరువు. దాన్ని ఆనుకుని ఉన్న గువ్వవానిపాలెం. అప్పటికీ ఇప్పటికీ పెద్దగా మార్పేమీ లేదు.

అందరి మనసుల్లోనూ ఉద్వేగం.

ఇలా స్నేహితులంతా అనుకోకుండా కలుసుకోవడం... ఇన్నాళ్ల తర్వాత మా ఊరిలో తిరిగి అడుగు పెట్టబోతున్న ఆనందం. మరోపక్క ఇదంతా కల కాదు కదా అన్న భయంతో నా మనసంతా గందరగోళంగా ఉంది.

"అవునూ... రాంబాబు ఈమధ్య మీలో ఎవరికైనా ఉత్తరం రాశాడా?" అని అడిగింది హఠాత్తుగా రామలక్ష్మి.

"నాకు రెండేళ్ల క్రితం అనుకుంటా... ఒక ఉత్తరం వచ్చింది. పనుల ఒత్తిడిలో పడి సమాధానం రాయలేకపోయాను" అన్నాడు బాబి.

"మన స్నేహబృందంలో వాడొక్కడే కదూ ఆ పల్లెటూళ్లో తన పొలాలని నమ్ముకుని కదలకుండా అక్కడే ఉండిపోయింది?" అన్నాడు సుందరం.

రాంబాబు నుంచి నాకు కూడా మూడేళ్ల క్రితం ఉత్తరం వచ్చింది. "రిటైరైపోయావు కదా... ఇంక అక్కడేం పని? మనూరికొచ్చెయ్యరాదా? అంటూ రాశాడు సమాధానం ఏం రాయాలో తెలియక ఉత్తరం రాయలేదు"

"మీకు గుర్తుందా? నాకు జీవితంలో ఒకే ఒక్క కోరిక... నేను చనిపోయే ముందు కూడా చివరి క్షణంలో మీరంతా ఇలా నా కళ్లెదురుగా ఉంటే చాలు... హాయిగా కన్ను మూస్తాను అనేవాడు రాంబాబు. వాడెంత సెంటిమెంటలో కదా?" అంది రామలక్ష్మి.

"అవును... మనం సమాధానం రాసినా రాయకపోయినా అదేం పట్టించుకోకుండా తనే అందరికీ ఉత్తరాలు రాస్తూ ఉంటాడు" అన్నాడు బాబి.

"మనం అందరం ఇలా వస్తున్నామని తెలిస్తే రెండ్రోజుల ముందుగానే స్టేషనుకొచ్చి కూర్చునే వాడు" అంది రామలక్ష్మి.

మా అందరికీ ఒకేసారి జీవితం మీద విసుగొచ్చి మా ఊరెళ్లిపోవాలన్న ఆలోచన వచ్చినట్టుగా రాంబాబుకి కూడా మేము వస్తామేమోనన్న ఆలోచన వచ్చి స్టేషన్‌కి రావచ్చు కదా అనిపించింది నాకు.

రైలు వేగంగా ముందుకు దూసుకుపోతోంది.

నాగయ్యగారి మామిడి తోపులు దాటగానే కొంచెం వేగం తగ్గింది. మా ఊరి పొలిమేరలలోకి వచ్చేసిందన్న మాట రైలు.

అందరం సామాన్లు తీసుకుని లేచి నుంచున్నాం.

"పదండి... పదండి... మనూర్లో రైలు ఎక్కువ సేపు ఆగదు" అంటూ రామలక్ష్మి అందర్నీ గుమ్మం దగ్గరకి తోసింది.

ఊరు దగ్గరపడుతున్నకొద్దీ రైలు వేగం బాగా తగ్గుతోంది.

ఊరి చివర్నుండే శివాలయం వచ్చేసింది.

అందరూ బయటికి తొంగి చూశాం.

పురాతనమైన ఆ శివాలయం మరింత పాత బడింది. అయినా చెక్కు చెదరని అదే పవిత్రత. పాతకాలం నాటి మైకులోంచి భక్తిగీతాలు వినిపిస్తున్నాయి. దూరంగా గుళ్లో గంటల శబ్దం.

గుడిని దాటుకుంటూ రైలు స్టేషన్లోకొచ్చి ఆగింది.

రాంబాబు స్టేషన్‌కి వచ్చేడా? నాలో ఆతృత.

"దిగండి... దిగండి..." అంటూ రామలక్ష్మి తొందర చేస్తోంది.

అంతలో "ఏవండీ..." అంటూ నన్ను వెనక నుంచి ఎవరో పిలుస్తున్నారు.

మావాళ్లు ఒక్కొక్కరూ దిగిపోతున్నారు.

నేను రాంబాబు కోసం దిక్కులు చూస్తున్నాను..

"ఏమండీ..." అంటూ వెనుక నుంచి మళ్లీ పిలుపు.

"దిగు... దిగు..." అంటూ ప్లాట్‌ఫామ్మీద నుంచి రామలక్ష్మి చేతుల్తో సైగలు చేస్తోంది.

అంతలో రైలు "కూ" అంటూ కూతవేస్తూ కదలి వేగం పుంజుకుంది.

అయ్యో... నేను కిందకి దిగలేదే... గబగబా దిగాలి.

మళ్లీ వెనుక నుంచి పిలుపు... నన్ను రైలు దిగనీయకుండా ఆపడానికన్నట్లుగా ఉందా పిలుపు.

నేను ఆగకూడదు... రైలు దిగిపోవాలి... మా ఊళ్లోకి వెళ్లాలి...

ముందుకు అడుగు వేశాను.

నా అడుగు భూమ్మీద పడలేదు...

ఎక్కడికో... దిగంతాల అంచుల్లోకి జారిపోతున్నట్లుగా ఉంది.

నేనెక్కడికి పోతున్నాను? నా స్నేహితులేమయ్యారు? మా ఊరేది?

ఏమీ అర్థం కావడం లేదు.

★ ★ ★

"ఏవండీ... ఏవండీ..." అని ప్రియంవద నాలుగోసారి తట్టి లేపితే కానీ అర్థం కాలేదు... ఇదంతా కలని!

ఎంత విచిత్రమైన కల?

అయినా నా పిచ్చిగానీ, 'కూ' అంటూ కూతవేసే రైలు బండ్లు ఇప్పుడెక్కడ ఉన్నాయి?

"అబ్బాయి ఫోన్ చేశాడు" అంటూ రిసీవర్ నా చేతికి ఇచ్చింది.

రిసీవర్ తీసుకుని "హలో" అన్నాను.


"ఏమిటి నాన్నా పట్టపగలు అంత మొద్దు నిద్ర" అన్నాడు.

"నీకు పగలే కావచ్చురా... కానీ మాకిది రాత్రి సమయం" అన్నాను అమెరికాలో ఉంటున్న వాడినుద్దేశించి.

"ఏంటి నాన్నా ఆ పల్లెటూరుకి వెళ్లి సెటిలైపోదామంటున్నావట అమ్మతో" అన్నాడు వాడు.

"అబ్బే... అదేం లేదురా... నేనింకా సీరియస్‌గా ఆ విషయాన్ని గురించి ఆలోచించలేదు. ఇక్కడి జీవితంతో విసుగొచ్చినప్పుడు ఒక్కోసారి అలా అనిపిస్తూ ఉంటుంది" నిండుగా నవ్వేస్తూ అన్నాను.

వాడు కూడా తేలిగ్గా నవ్వేశాడు.




"నేనూ అమ్మతో అదే అన్నాను. నాన్న అంత తేలిగ్గా హైదరాబాద్ వదలి వెళ్లలేడులేమ్మా అని. ఆ పల్లెటూళ్లో ఇవాల్టికి కూడా సరైన టెలిఫోన్ సౌకర్యం లేదు. నీ కల్చరల్ యాక్టివిటీస్, షేర్స్ బిజినెస్సూ ఎలా సాగుతాయక్కడ. ఈమాత్రం కాలక్షేపం కూడా ఉండదు." అన్నాడు.

"నిజమేరా.. అందుకే ఇంకా ఆ విషయం మీద ఒక నిర్ణయానికి రాలేకపోతున్నాను" అన్నాను.

"ఇంకా అందులో ఆలోచించడానికేముంది నాన్నా. అక్కడున్న ఆ కాస్త పొలాన్ని అమ్మేస్తే సరి" అన్నాడు.

"సరేలే.. ఇంకేమిటి విశేషాలూ" అన్నాను నేను మాట మారుస్తూ.

★ ★ ★

జాగింగ్‌కి వెళ్లడానికి సిద్ధమవుతూ రాత్రి నాకొచ్చిన కల గురించి ఆలోచించసాగాను.

నాలో అంతర్గతంగా ఉన్న కోరికకి ప్రతిరూపమే ఆ కల!

నా ఆశలకి జీవాన్ని పోసి నన్ను నేనుగా నిలబెట్టుకోవడానికి పునాది వేసిన ఆ పల్లెతల్లి ఒడిలో పాత స్నేహితుల మధ్య నా జీవిత చరమాంకాన్ని గడపాలన్న కోరిక.

చాలా చిన్నదే అయినా ఆ కోరిక తీర్చుకోలేకపోవడానికి ఎన్నో కారణాలు.. ఎన్నో బలహీనతలు..

టీవీలో అలహాబాద్‌లోని త్రివేణి సంగమం దగ్గర జలకాలాడుతున్న సీగల్ పక్షులని చూపిస్తున్నారు.. సైబీరియాలో శీతాకాలం మొదలవ్వడంతో అవి వేల కిలోమీటర్లు ప్రయాణించి మన దేశం వలస వచ్చాయి. మళ్లీ అక్కడ శీతాకాలం ముగియగానే అవి అన్ని వేల కిలోమీటర్లూ ప్రయాణించి తమ మూలాలని వెదుక్కుంటూ వెనక్కి వెళ్లిపోతాయి!

కానీ మనిషి అలా కాదు. తాను వలసవచ్చిన ప్రాంతంలోని అందాలకు, ఆకర్షణలకూ, సౌకర్యాలకీ బానిసైపోయి తిరిగి వెళ్లలేడు!

అలా కాకపోయి ఉంటే ఈనాడు పల్లెటూళ్ల జనాభా ఇంతలా తగ్గిపోయి ఉండేది కాదు.

నా కలలోకి వచ్చిన మిగతా స్నేహితులంతా ఏం చేస్తున్నారో?

నాలాగే కలలు కంటూనే ఉన్నారో.. లేక ఆ కలని నిజం చేసుకోవడానికేమైనా ప్రయత్నిస్తున్నారా?

నిన్ననే మా ఊరి నుంచి రాంబాబు మరో ఉత్తరం రాశాడు. "నువ్విక్కడికి వస్తావా లేక మీ పొలం అమ్మేసి డబ్బు పంపించమన్నావా" అంటూ.

నేను ఎప్పటిలాగే ఆ ఉత్తరానికి కూడా సమాధానం రాయదల్చుకోలేదు.

ఆ పొలం అమ్మడం నాకిష్టం లేదు.

అది కూడా అమ్మేస్తే ఉన్న ఆ ఒక్క బంధం కూడా తెగిపోతుంది.

జీవితంలో ఇంక ఎప్పటికీ అక్కడికెళ్లగలనన్న ఆశ ఉండదు.

కనీసం 'ఆ ఆశ చచ్చిపోవడం' నాకిష్టం లేదు!